ప్రజాశక్తి

బుధవారం 29 మే 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా

కలుషిత నీరు...పైప్‌లైన్ లీకేజీలు...

అతిసారతో ఇంకా ఆస్పత్రుల్లోనే పలువురు రోగులు
బాధితులను పరామర్శించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని మొగల్రాజపురంలో అతిసార రోజురోజుకూ ప్రబలుతోంది. దీంతో ఆ ప్రాంత ప్రజలు అవస్థతకు గురవుతున్నారు. ఇందుకు ప్రధానంగా మంచినీరు కలుషితం కావడమే కారణమని చెబుతున్నారు. వారం రోజుల నుండి వాంతులు, విరేచనాల సమస్యతో 100 మందికిపైగా అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఇప్పటికీ 50మందికిపైగా అతిసారతో ఇబ్బందులు పడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటికే ఒకరు మృతిచెందారు. గత రెండు నెలలుగా విజయవాడ నగరంలో కలుషిత మంచినీరు సరఫరా అవుతోంది. భవానీపురంలోని హెడ్ వాటర్ వర్క్స్ దద్ద నుండే నీటిని శుద్ధిచేయకుండా పైపుల ద్వారా పంపిణీ చేస్తున్నారే విమర్శలు వస్తున్నాయి. ఈనేపథ్యంలోనే మంచినీరు రంగుమారి వస్తోందని, బురద నీళ్లు వస్తున్నాయని ప్రజలు ఫిర్యాదులు చేసినా నగర పాలక సంస్థలో పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. కార్పొరేషన్, ప్రభుత్వం మొద్దునిద్రలో ఉన్నాయి. రెండు గంటలు సరఫరా చేసే మంచినీరు కనీసం సమయానికి కూడా ఇవ్వడం లేదనే విమర్శా ప్రజల నుండి వస్తోంది. నగరంలో డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మంచినీటి పైపులు అనేక చోట్ల లీకవుతున్నాయి. దీంతో ఎక్కడ మంచినీరు కలుషితమవుతుందో గుర్తించే పరిస్థితి కూడా లేకుండా పోయింది. పైప్‌లైన్ల లీకేజీలు, ఓవర్ హెడ్ ట్యాంక్‌లను శుభ్రం చేయకపోవడం వంటి కారణాలతో మంచినీటి దుర్వాసన వస్తోందని, కలుషిత అవుతోందని నగర ప్రజలు పలు సందర్భాల్లో విఎంసి అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ అధికారులెవరూ పట్టించుకోవడంలేదు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతిసార బాధితుడిని పరామర్శిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, కృష్ణ తదితరులు

భవానీపురంలోని హెడ్‌వాటర్ వర్క్స్

బాధితులను ఆదుకోవాలి
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్

అతిసార ప్రబలిన మొగల్రాజపురం ప్రాంతంలో మంగళవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పర్యటించారు. బాధితులను పరామర్శించారు. మృతిచెందిన దుర్గారావు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ అతిసారతో మరణించిన వల్లూరి దుర్గారావు కుటుంబానికి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే సమస్యను పరిష్కరించి అతిసార బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. వారం రోజులుగా మంచినీటి కాలుష్యం కారణంగా ఈ ప్రాంతంలో అతిసార ప్రబలి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వారం రోజుల తర్వాత పత్రికల్లో వార్తలు వస్తేగాని ఈ ప్రాంతంలో ఇటువంటి సమస్య ఉందని కనీసం గుర్తించే పరిస్థితి లేకపోవడం బాధాకరమన్నారు. అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులంతా ఎన్నికలు, ఓట్లు రందిలో ఉన్నారు తప్ప ప్రజల సమస్యలను పట్టించుకునే పరిస్థితుల్లో లేరని ఆవేదన వ్యక్తం చేశారు. కుళాయిలకు మంచినీటి మీటర్లు పెట్టడం, ఛార్జీలు వసూలు చేయడంపై దృష్టి పెట్టడం తప్ప ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించే (మిగతా 2లో)

మొగల్రాజపురంలో పర్యటించి స్థానికుల నుండి వివరాలు తెలుసుకుంటున్న విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గుంటూరుకు మంచినీటి శాంపిళ్లు

అధికారులకు విఎంసి కమిషనర్ దినకర్ ఆదేశం
మొగల్రాజపురంలో పరిస్థితి పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం మొగల్రాజపురంలో పర్యటించారు. పటమట వారి వీధి, గుమ్మడి వీధి, అట్లూరి పర్వతమ్మ విధి, వాటర్ ట్యాంక్ రోడ్డు, ఆశ్రమం రోడ్డు, బోయపాటి వారి వీధిలో సరఫరా అవుతున్న మంచినీటిని పరిశీలించారు. అనంతరం మొగల్రాజపురం వాటర్ ట్యాంక్‌ను సందర్శించి, వాటర్ ట్యాంక్‌లో నుండి సరఫరా అవుతున్న నీటిలో ఏదైనా సమస్య ఉందా అని చూశారు. స్థానికులతో మాట్లాడి మంచినీటి సరఫరాలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొగల్రాజపురంలో అతిసార కేసు ఒకటే ఉందన్నారు. కుటుంబ సభ్యుల్లోగానీ, చుట్టుపక్క ఇళ్లల్లోగానీ అతిసార కేసులు లేవన్నారు. ముందుగా మంచినీటి శాంపిల్ పరీక్షించామని, ఎటువంటి కలుషితం లేదని రిపోర్టు వచ్చిందని చెప్పారు. అయినా మరికొన్ని పరీక్షల కోసం మంచినీటి శాంపిళ్లను గుంటూరు ల్యాబ్‌కు పంపామని చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని కమిషనర్ అన్నారు. ముందస్తు నివారణ కోసం ఇంటింటి సర్వే నిర్వహించి తాగునీటి విషయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ జనరల్ మహేష్, జోనల్ కమిషనర్-3 శివరామకృష్ణ, చీఫ్ ఇంజనీర్ ఎం ప్రభాకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 3 చంద్రశేఖర్, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

నత్తనడకన విమానాశ్రయ అభివృద్ధి

న్యూ ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ నిర్మాణంలో నిర్లక్ష్యం
2019లో రూ.611 కోట్లతో ప్రారంభం
ఐదేళ్లుగా సాగుతూనే ఉన్న పనులు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎయిర్‌బస్ 340 ఎయిర్ క్రాఫ్ట్‌లు తిరుగుతున్నాయి. 200 మంది ప్రయాణించడానికి సాధారణ విమానంలో అవకాశాలు ఉంటే....ఈ ఎయిర్ బస్ 340 ఎయిర్ క్రాఫ్ట్‌లో 300 నుంచి 350 మంది ప్రయాణించే అవకాశం ఉంది. ఇంత అతిపెద్ద విమానాలు ల్యాండ్ అవుతున్న విమానాశ్రయంలో ప్రయాణీకులకు సౌకర్యాల కల్పనలో భాగంగా నిర్మించాల్సిన నూతన ఇంటిగ్రేటెడ్ టెర్నినల్ బిల్డింగ్ నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. 2019లో ప్రారంభమైన ఈ టెర్నినల్ నిర్మాణ పనులు 2021లోనే రెండేళ్లలో పూర్తవ్వాలి. ఐదేళ్లయినప్పటికీ కాంట్రాక్టు సంస్థ పనులను పూర్తి చేయలేదు.

నత్తనడకన సాగుతున్న న్యూ ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణం

అమరావతి రాజధానిగా ప్రకటించిన తర్వాత కేంద్ర ప్రభుత్వం 2017లో విజయవాడ సమీపంలోని గన్నవరం విమానాశ్రయాన్ని అంతర్జాతీయ స్థాయికి అప్‌గ్రేడ్ చేసింది. భారీ స్థాయిలో భూములను సేకరించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి విమానాలు నిలిచేందుకు వీలుగా రన్‌వేలను నిర్మించారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్యాసెంజర్ ట్రాఫిక్‌కు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనలో భాగంగా విమానాశ్రయంలో రూ.611.80 కోట్లతో ఇంటిగ్రేడెట్ టెర్నినల్ నిర్మాణాన్ని చేపట్టారు. దీనిని ఎన్‌కెజి సంస్థ టెండరు దక్కించుకుంది. ఒప్పందం ప్రకారం 2021లో (మిగతా 2లో)

మార్గదర్శకాలకనుగుణంగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో జాగ్రత్తగా ఉండాలని, ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా సరైన నిర్వహణ నైపుణ్యాలతో కౌంటింగ్ ప్రక్రియ సాఫీగా జరిగేలా సన్నద్ధులు కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు సూచించారు. మంగళవారం నగరంలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో కలెక్టర్ డిల్లీరావు.. జాయింట్ కలెక్టర్, మైలవరం ఆర్‌వో పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్, విజయవాడ సెంట్రల్ ఆర్‌వో స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులతో కలిసి పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌పై కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ డిల్లీరావు... పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు సంబంధించి అనుసరించాల్సిన విధివిధానాలను వివరించారు. ప్రాక్టికల్‌గా ఓట్ల లెక్కింపులోని దశలను తెలియజేశారు. ఈకార్యక్రమంలో డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, విజయవాడ తూర్పు ఆర్‌వో బీహెచ్ భవానీ శంకర్, తిరువూరు ఆర్‌వో కె.మాధవి, జగ్గయ్యపేట ఆర్‌వో జి.వెంకటేశ్వర్లు, శిక్షణ కార్యక్రమాల నోడల్ అధికారి ఎన్‌వీ శివప్రసాద్‌యాదవ్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కె.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో సీహెచ్ నాగలక్ష్మి, కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు , మైక్రో అబ్జర్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ల శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి ఎస్.డిల్లీరావు

విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి

సిపిఎం రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - విజయవాడ : ఇండోసోల్ సంస్థకు భూ కేటాయింపులు, రాయితీలు, విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. విద్యుత్ పరికరాల కొనుగోళ్ల అవకతవకలపై విచారణ జరిపించాలని కోరారు. విద్యుత్ భారాలు తగ్గించాలని, విద్యుత్ దోపిడీని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. అదాని, శిరిడీసాయి కంపెనీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఊడిగం చేయటం సిగ్గుచేటన్నారు. మంగళవారం సిపిఎం నేతలు 33వ డివిజన్ సత్యనారాయణపురంలో విస్తృతంగా పర్యటించారు. ఓటర్లను కలుసుకుని ధన్యవాదాలు తెలిపారు. స్థానిక ప్రజలు విద్యుత్ చార్జీలు భారాలు, నగరపాలక సంస్థ మోపుతున్న ఇంటిపన్ను, చెత్తపన్ను, ఇతర భారాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వాలు విద్యుత్ రంగాన్ని తమ దోపిడీకి కేంద్రంగా మార్చాయన్నారు. అటు అదాని, రాష్ట్రంలో షిరిడి సాయి కంపెనీలు విద్యుత్ రంగాన్ని కబళిస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ బడా సంస్థలకు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. బిజెపితో టిడిపి పొత్తుకుదుర్చుకుని కేంద్ర విధానాలను బలపరచడం ప్రమాదకరమన్నారు. బిజెపి, వైసిపి, టిడిపి విద్యుత్ రంగంలో దోపిడీ చేస్తున్న బడా సంస్థల కొమ్ము కాయటం గర్హనీయమన్నారు. ఈపర్యటనలో సిపిఎం నేతలు బి.రమణరావు, మురళి, సాగర్, చారి, శ్రీనివాస్, పీర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ జయంతి వేడుకల్లో వసంత

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎన్‌టిఆర్ 101వ జయంతిని ఇబ్రహీంపట్నం, కొండపల్లి మున్సిపాలిటీలోని టిడిపి కార్యాలయాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైలవరం అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్ తదితరులు ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేకులు కట్ చేసి పంచుకున్నారు.

మొదటిపేజీ తరువాయి

నత్తనడకన విమానాశ్రయ అభివృద్ధి

ఈ టెర్నిల్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాల్సి ఉంది.

ప్రయాణీకులకు అసౌకర్యం

కరోనా కాలంలో మినహా దానికి ముందు, తర్వాత రెండేళ్లకు ఏడాదికి సగటున ఎనిమిది లక్షల నుంచి పది లక్షల మంది ఈ విమానాశ్రయం నుంచి జాతీయ, అంతర్జాతీయ విమానాల్లో ప్రయాణిస్తున్నారు. ప్రయాణీకుల అవసరాలకు అనుగుణంగా నూతనంగా ఇంటిగ్రేటెడ్ టెర్నినల్ నిర్మాణాన్ని చేపట్టారు. దీనిలో భాగంగానే అంతర్జాతీయ ప్రయాణీకులు నూతన టెర్నినల్‌లోకి వెళ్లేందుకు వీలుగా నాలుగు వరుసల మినీ ఫ్లవోవర్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. టెర్నినల్ నిర్మాణం పూర్తవ్వకపోవడంతో దీన్ని అనుసందానించలేదు.

సౌకర్యాలు ఇలా

ప్రయాణీకుల సంఖ్యకు అనుగుణంగా ఫోర్‌స్టార్ సదుపాయాలతో ఈ టర్నెల్‌ను నిర్మిస్తున్నారు. హవర్‌లీ హ్యాండిలింగ్ కెపాసిటీ 1200 (800 డొమెస్టిక్ ప్లస్ 400 ఇంటర్నేషనల్)గా ఉంది. ప్రయాణీకులు, లగేజీ బ్యాగ్‌ల చెక్ ఇన్‌కౌంటర్స్ 24, బ్యాగేజీ కన్‌ఫేయర్స్, ఇమ్మిగ్రేషన్ కౌంటర్‌లు 4 (డిపార్చర్), ప్లస్ 3 (అరైవల్స్) 1000 కార్లకు, 200 టాక్సీలు నిలపడానికి వీలుగా స్టాండ్స్‌ను నిర్మిస్తున్నారు. ఎల్ఇడి లైట్లు, వర్షపు నీటి నిల్వ గుంటలు, ఎనర్జీ ఎఫిసియెంట్ ఎయిర్ కండిషనింగ్ తదితర సౌకర్యాలతో ఈ ఇంటిగ్రేటెడ్ టెర్నినల్ బిల్డింగ్ నిర్మించాల్సి ఉంది. ఈ టెర్నినల్ అందుబాటులోకి వస్తే విమానాశ్రయంలో రోజువారీ ప్రయాణీకుల సంఖ్య మరింతగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

కలుషిత నీరు...పైప్‌లైన్ లీకేజీలు..

విషయంలో సరైన దృష్టిలేకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, కార్పొరేషన్ వారు మొద్దునిద్ర వీడి మంచినీరు, ప్రజల అనారోగ్య సమస్యలపై వస్తున్న ఫిర్యాదులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని బాబూరావు డిమాండ్ చేశారు. అతిసార బారినపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని ఆర్థికంగా ఆదుకోవాలని, తక్షణమే నగరంలో బోరు నీరు అందించే అన్ని ప్రాంతాల్లో కష్ణా నది నీటిని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తూర్పు నగర కార్యదర్శివర్గ సభ్యులు పి.కష్ణ, జి.క్రాంతి, నగర కమిటీ నాయకులు దావులూరి శ్రీనివాస్, స్థానిక నాయకులు కిరణ్, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణలో నిర్వాహకులు క్రాంతి తదితరులు

జూన్ 2న 'పర్యావరణ పరిరక్షణ'పై చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి - విజయవాడ : అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'పర్యావరణ పరిరక్షణ' అనే అంశంపై జూన్ 2వ తేదీన చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నగరంలోని బాలోత్సవ భవన్లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం, ఫోరంఫర్ ఆర్టిస్ట్, వన్ ఎర్త్ వన్ లైఫ్ బాధ్యులు టి.క్రాంతికిరణ్, ఎ.సునీల్ కుమార్, ఏలూరి లీలాకుమారి మాట్లాడారు. ఈ చిత్రలేఖనం పోటీలు మధ్యాహ్నం 3 గంటలకు మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం 4వ ఫ్లోర్‌లో జరుగుతాయని తెలిపారు. సబ్‌జూనియర్స్ (3 ,4, 5 తరగతులు), జూనియర్స్ (6,7 తరగతులు), సీనియర్స్ (8, 9, 10 తరగతులు) వారీగా ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. పోటీలో పాల్గొనదలచిన వారు ఈనెల 30వ తేదీలోపు తమ పేర్లు, తరగతులను 9347950085 లేదా 9490098042 వాట్సప్ నెంబర్లకు వాట్సప్ ద్వారా పంపి నమోదు చేసుకోవాలని కోరారు. పోటీలలో పాల్గొనే వారు మెటీరియల్‌ను వారే తెచ్చుకోవాలని, విజేతలకు మెమోంటోలు, సర్టిఫికెట్‌లను అదే రోజు సాయంత్రం అందజేస్తారని తెలిపారు. విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంబివికె బాధ్యులు పి.విజయ, ఫోరంఫర్ ఆర్టిస్ట్ బాధ్యులు అరసవిల్లి గిరిధర్, అరసవిల్లి సంధ్య, సౌజన్య, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ జారీపై ప్రభుత్వం నియంత్రణ ఉండాలి

టిపిఎ కార్యదర్శి ఎంవి ఆంజనేయులు

ప్రజాశక్తి-విజయవాడ : డ్రైవింగ్ లైసెన్సు జారీ ప్రక్రియను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే జవాబుదారీతనం లేకుండాపోయి ప్రమాదాలు చోటు చేసుకుంటాయని, దీనిపై ప్రభుత్వ నియంత్రణ అవసరమని టాక్స్ పేయర్స్ అసోసియేషన్ నగర కార్యదర్శి యంవి ఆంజనేయులు అన్నారు. అమెరికా, యురోపియన్ యూనియన్ దేశాలు, చైనా, జపాన్, రష్యా లాంటి అభివృద్ధి చెందిన దేశాలలో, ప్రైవేటు రంగంపై కఠినమైన నియంత్రణలు ఉన్నాయన్నారు. అయినప్పటికీ ఆ దేశాలు డ్రైవింగ్ లైసెన్సుల జారీ ప్రక్రియను ప్రైవేటు సంస్థలకు అప్పగించలేదన్నారు. డ్రైవింగు పరీక్షల నిర్వహణ, డ్రైవింగ్ లైసెన్సుల జారీ చేసే అధికారాన్ని అక్కడి ప్రభుత్వాలు తమ వద్దనే ఉంచుకున్నాయని వివరించారు. భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశమని, ఇక్కడ ప్రైవేటు సంస్థలపై కఠినమైన నియంత్రణలు లేవని అన్నారు. ఈ పరిస్థితిలో డ్రైవింగ్ లైసెన్సు జారీ ప్రక్రియను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే జవాబుదారీతనం లేకుండా పోతుందన్నారు. దీనిపై ప్రభుత్వ నియంత్రణ అవసరమన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేసే బాధ్యతను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించవద్దని, డ్రైవింగ్ నైపుణ్యాలను పరీక్షించి, లైసెన్సులు మంజూరు చేసే అధికారాన్ని ప్రభుత్వ రవాణా శాఖ తనవద్దే ఉంచుకోవాలని, ప్రైవేట్ డ్రైవింగ్ స్కూళ్ళను డ్రైవింగ్ శిక్షణ ఇవ్వడానికి మాత్రమే పరిమితం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టాక్స్‌పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.సాంబిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన మంచినీరు అందించాలి

50వ డివిజన్ కార్పొరేటర్ సత్యబాబు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్వచ్ఛమైన మంచినీరు అందించి, మంచినీటి సమస్యలు పరిష్కరించాలని సిపిఎం 50వ డివిజన్ కార్పొరేటర్ విఎంసి అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం కార్పొరేటర్ బి. సత్యబాబు 50 డివిజన్లోని పలు ప్రాంతాల్లో పర్యటించి మంచినీటి సరఫరాలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని అధికారుల దష్టికి తీసుకెళ్లారు. ఆలేటి వారి వీధి, మేకల వారి వీధి, టిఎస్పివీదీ, మహంతిపురం ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ మంచినీటి సరఫరాలో పసుపు పచ్చ రంగు నీరు రాకుండా అరికట్టాలన్నారు. దుర్వాసన అరికట్టాలని, మురుగుకాలవలో మంచినీటి కలెక్షన్లు తొలగించి, ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరారు. గొల్లపాలెం గట్టు, వించిపేట మహంతీపురం ప్రాంతాల్లో మంచినీటి సరఫరా మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ ప్రక్రియ నిషేధ చట్టంపై మంగళవారం కలెక్టరేట్లో కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులతో సమీక్షించారు. ఈచట్టంపై అధికారులు విస్తతంగా అవగాహన కల్పించాలన్నారు. వైద్యశాఖ అధికారులే కాకుండా కమిటీ సభ్యులు కూడా వారి పరిధిలో నిర్వహిస్తున్న అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ఈసమావేశంలో ఇటీవల విజయవాడ పట్టణ పరిధిలోని" పెర్టీకేర్" సహాయక పునరుత్పత్తి సాంకేతిక కేంద్రం సీజ్ చేసిన క్రమంలో తదుపరి చర్యలు కోసం చర్చించి సమావేశంలో చట్ట పరిధిలో తీసుకోవలసిన చర్యలు పై తీర్మానించారు. కమిటీ సభ్యులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.యం.సుహాసిని, వాసవ్య మహిళా మండలి సభ్యులు రేష్మీ, డిపిఎంఒ డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆరోగ్యంపై జాగ్రత్త అవసరం : డాక్టర్ ఇండ్ల స్వప్న

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గవర్నర్ పేటలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం సందర్భంగా మంగళవారం స్వప్న నేత్ర వైద్యశాల కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఇండ్ల స్వప్న కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి తీసుకోవాల్సిన జాగ్రతల గురించి వివరించారు. అతిగా మొబైల్ ఫోన్ వాడటం వలన కంటికి జరిగే అనర్థాలు గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. దీనిలో భాగంగా క్రమబద్ధమైన జీవన విధానం ఆరోగ్యకరమైన ఆహారం, కంటి చూపుకు సంబంధించిన క్రమ శిక్షణ మొదలగు అంశాలును వివరించారు. వేసవి సెలవుల్లో అదేపనిగా టీవీ, మొబైల్ చూడకుండా ఆరుబయట మైదానంలో ఆటలు ఆడటం, ఇంట్లో చేయగలిగే ఆర్ట్స్, క్రాఫ్ట్స్ చెస్ మొదలగు ఆటలు ఆడటం మంచిదన్నారు. పుస్తకాలు చదివితే విజ్ఞానంతో పాటు కంటికి మంచి వ్యాయామం అవుతుందన్నారు. విద్యార్ధులు అడిగిన సందేహాలను డాక్టర్ స్వప్న నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి కె రమాదేవి పాల్గొన్నారు.

పేరు మార్పు

నేను చీమకుర్తి మీరమ్మ W/o చీమకుర్తి మీరయ్య, నివాసం : డి.నెం.41-22/1-7, భ్రమరాంభపురం, మలేరియా హాస్పిటల్ రోడ్డు, కృష్ణలంక, విజయవాడ. నా యొక్క పోస్టల్ కిసాన్ వికాస్ పత్రం బాండ్ డాక్యుమెంట్‌లో నాపేరు Ch.మీరాబి **(Ch.Meerabi)** అని తప్పుగా రాయడం జరిగింది. నా అసలు పేరు **చీమకుర్తి మీరమ్మ.(Chimakurthy Meeramma)**, W/o Ch.Meeraiah. **Ch.మీరాబి మరియు చీమకుర్తి మీరమ్మ (Ch.Meerabi and Chimakurthy Meeramma)** ఒకరే గా తెలియజేయుట జరిగినది. **Bond No.** 25AB045475, 25AB045476, 25AB045477, 25AB045478, 70BC138478, 20CE200823, 20CE200824, 20CE200825, 20CE200826 Regn No. 23135.
ఈ నెంబర్ల మీద Ch. మీరాబి అని ఉంది.అది తప్పుగా ఉన్నది. నేటి నుండి నా పేరును **చీమకుర్తి మీరమ్మ**గా పిలవబడును.

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

I.P. No. 24/2021

Between:

Petitioners: Karimijji Srikanth and Another

AND

Respondents:
Burepalli Naga Malleswari @ Bujji
and 38 Others

R-2: Pusunuri Raja Babu @ Stalin, S/o. Not known, Door No. 3-59, Nidamanuru Rivars Canal Katta, Near By-Pass Road, Vijayawada.

R-3: Cheekati Mahesh @ Chinna, S/o. Venkateswara Rao, Door No. 3-59, Nidamanuru Rivars Canal Katta, Near By-Pass Road, Vijayawada.

R-7: Kommu Lakshmana Rao, S/o. Surayya, Door No. 3-57, Nidamanuru Rivars Canal Katta, Near By-Pass Road, Vijayawada.

R-8: Kommu Venkateswara Rao, S/o. Lakshmana Rao, Door No. 3-59, Nidamanuru Rivars Canal Katta, Near By-Pass Road, Vijayawada.

R-9: Inampudi Venkateswara Rao, S/o. Bhushayya, D.No. 6-92, Poranki Road, Nidamanuru, Vijayawada.

R-11: Movva Ramana, S/o. Not known, R/o. Tank Bazaar, Aiswarya Apartments, 2nd Line, Nidamanuru, Vijayawada.

R-12: Chanumolu Prabhakara Rao, S/o. Not known, R/o. Tank Bazaar, Aiswarya Apartments, 2nd Line, Nidamanuru, Vijayawada.

R-13: Borra Subba Rao, S/o. Not known, R/o. Tank Bazaar, Aiswarya Apartments, 2nd Line, Nidamanuru, Vijayawada.

R-15: Kommu Srinivasa Rao, S/o. Appala Ramulu, Contractor, R/o. Gunadala Centre, A.B.Twins Apartments, 4th Floor, Vijayawada.

R-16: Kommu Vijaya Durga Bhavani, W/o. Srinivasa Rao, R/o. Gunadala Centre, A.B.Twins Apartments, 4th Floor, Vijayawada.

R-17: Amballa Sanyasi Rao, S/o. Not known, R/o. Gunadala Centre, A.B.Twins Apartments, 4th Floor, Vijayawada.

R-19: Ankam Paleswara Rao, S/o. Not known, Post Man, R/o. Rama Nagar, Near Ramalayam, Nidamanuru, Vijayawada.

R-20: Parameswara Rao, S/o. Not known, Opp. Panchayat Office, Prasad Textiles, New Andhra Bank Building, Nidamanuru, Vijayawada.

R-21: Yarlagadda Prasada Rao, S/o. Not known, Opp. Panchayat Office, Prasad Textiles, Near Andhra Bank Building, Nidamanuru, Vijayawada.

R-25: Thotakura Krishna @ Military Krishna, S/o. Not known, R/o. Thotakura vari Street, Nidamanuru, Vijayawada.

R-27: Kudaravalli Ranga Veni, W/o. Siva Prasad, R/o. Nidamanuru, Vijayawada.

R-29: Sattiraju Sitaram, S/o. Not known, Auto Nagar, Patamata, Vijayawada.

R-30: Narra Venkateswara Rao, S/o. Not known, Veternary Hospital Centre, Near Anjaneya Swamy Temple, Nidamanuru, Vijayawada.

R-34: Inampudi Uma Maheswara Rao, S/o. Not known, Main Road, Nidamanuru, Vijayawada.

R-35: Kommineni Ravi, S/o. Not known, Thotakura vari Street, Nidamanuru, Vijayawada.

R-36: Paruchuri Sridevi, W/o. Not known, R/o. Thotakura vari Street, Nidamanuru, Vijayawada.

R-37: Mekala Rangarao, S/o. Not known, Door No. 104, Rivers Canal Katta, Near By-pass Road, Nidamanuru, Vijayawada.

ఈ నెంబరు IP లో పై రెస్పాండెంట్స్‌కు ఎన్ని పర్యాయములు IP నోటీసులు పంపించినను వాళ్ళు తీసుకొనక పిటీషనర్లును చిక్కులు పెట్టవలెననే దురుద్దేశ్యముతో కాలయాపన చేయుచున్నందున వాళ్ళకు నోటీసులు అమలు జరగనందున శ్రీ కోర్టు వారు Substituted Service ద్వారా పేపరు ప్రకటనకు ఆర్డరు వేసి పై రెస్పాండెంట్స్ హాజరు నిమిత్తము **ది. 19-6-2024 సం॥ తేదీకి వాయిదా వేసినారు.** కావున సదరు వాయిదాకు రెస్పాండెంట్లు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని **ఉదయం 10 గంటలకు** శ్రీ పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

ఎన్.ఆనంద చక్రవర్తి
అడ్వకేట్, నరసాపురం
సెల్: 9849145267

నరసాపురం
ది. 20-5-2024

అవనిగడ్డలో...

గుడివాడలో...

ఘంటసాలలో..

పలుచోట్ల ఎన్‌టిఆర్ జయంతి

ప్రజాశక్తి-గుడివాడ : ఎన్‌టిఆర్ 101వ జయంతి వేడుకలు కృష్ణాజిల్లాలో పలు మండలాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్‌లో గుడివాడ టిడిపి అభ్యర్థి వెనిగండ్ల రాము నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని, మరో వారం రోజుల తర్వాత వచ్చే అధికార ప్రకటనతో భారీ మెజారిటీతో గుడివాడలో టిడిపి జెండా ఎగురవేసి ఎన్టీఆర్ ఘన నివాళులర్పిస్తానని అన్నారు. తెలుగు ప్రజల ఆత్మబంధువు ఎన్టీఆర్ అన్నారు. గుడివాడ టిడిపి కార్యాలయంలో కూటమి పార్టీల నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ పిన్నమనేని బాబ్జి, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళీ పాల్గొన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణంలో స్టేడియం కమిటీ జీవితకాల సభ్యులు పాలేటి శివ సుబ్రహ్మణ్యం(చంటి), వల్లభనేని లక్ష్మీవరప్రసాద్ తదితరులు నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో లంకదాసరి ప్రసాదరావు, పర్వతనేని ఆనంద్ పాల్గొన్నారు. **చల్లపల్లి:** స్థానిక ఎన్టీఆర్ పార్కులో ఎన్టీఆర్ చిత్రానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. మండల పరిధిలోని పాగోలు, వెలివోలు, నడకుదురు, లక్ష్మీపురం తదితర గ్రామాలలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మోర్ల రాంబాబు, సీనియర్ నాయకులు మోర్ల ప్రసాద్, ట్రేడ్ యూనియన్ నాయకులు జల్లూరి ప్రసాద్, చల్లపల్లి ఎంపీపీ కోట విజయ రాధిక, సీనియర్ నాయకులు మండల బాలవర్ధిరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు. **గన్నవరం:** గన్నవరం నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మరాజు సుధీర్, జాస్తి శ్రీధర్, బోయపాటి మురళీకృష్ణ పాల్గొన్నారు. బాపులపాడు గ్రామంలో ప్రవంతి ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ట్రస్ట్ ఛైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ అభిమానుల మధ్య వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి చిన్నాల చిన్నా, వీరమాచనేని బుజ్జి పూలమాలలు వేశారు. అనంతరం వీరమాచనేని శ్రీదేవి, దాసరి బెనర్జీ, మొవ్వా రామారావు కేక్ కట్ చేశారు. **ఉయ్యూరు:** వెనుకబడిన వర్గాలకు రాజకీయాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించి వారి అభ్యున్నతి, సా ధికారిత కోసం నందమూరి తారకరామారావు నిబద్ధతతో కృషి చేసిన మహా నాయకుడని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, కూటమి పెనమలూరు అభ్యర్థి బోడె ప్రసాద్ కీర్తించారు. ఎన్టీఆర్ 101వ జయంతి పురస్కరించుకుని స్థానిక పార్టీ కార్యాలయంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యెనిగళ్ళ కుటుంబరావు, పట్టణ అధ్యక్షుడు గుర్నాధరావు, ఉయ్యూరు ఛైర్మన్ వి.సత్యానారాయణ, మాజీ ఛైర్మన్లు పూర్ణ చంద్రరావు, ఖుద్దూస్, దండమూడి చౌదరి పాల్గొన్నారు. ముదునూరులోని ప్రధాన సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకుడు పొందుగు బాలాజీ ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. ఆకునూరులో ఆకునూరులో తెలుగు రైతు నాయకుడు కాకాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలగపూడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ గోలి వసంతకుమార్ పాల్గొన్నారు. **ఘంటసాల:** స్థానిక టిడిపి కార్యాలయం వద్ద మొవ్వ మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ తుమ్మల జనార్ధన బాబు ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తుమ్మల చౌదరిబాబు, పరిసె చలపతి, మాజీ ఎంపీపీ మట్టా రాజారావు పాల్గొన్నారు. **అవనిగడ్డ:** గాంధీ క్షేత్రంలో జనసేన టిడిపి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఉపసభాపతి, అవనిగడ్డ నియోజకవర్గ జనసేన పార్టీ అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ పూలదండలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పరుచూరి దుర్గాప్రసాద్, కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే రాఘవ, బచ్చు రఘునాథ్ పాల్గొన్నారు. టిడిపి కార్యాలయంలో యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం 11 మంది సీనియర్ నాయకులకు సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలి రామ్మోహన్రావు, మత్తి రంగారావు, చిరువోలు బాలకోటేశ్వరరావు పాల్గొన్నారు. **పమిడిముక్కల:** స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాస్ ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జక్కా శ్రీనివాసరావు, కొల్లూరు బాబ్జి, నాదెండ్ల సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, మద్దివాడ గ్రామ సర్పంచ్ వంపుగాళ్ళ ఫ్రాన్సిస్ పాల్గొన్నారు. **కంకిపాడు:** స్థానిక టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కేక్ కట్ చేశారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా, మండల టీడీపీ అధ్యక్షుడు సుదిమళ్ళ రవీంద్ర, మాజీ ఎంపిపి దేవినేని రాజా, సీనియర్ నేతలు తుమ్మలపల్లి హరికృష్ణ, యలమంచిలి కిషోర్ బాబు పాల్గొన్నారు. టిడిపి సీనియర్ నేత తుమ్మలపల్లి హరికృష్ణ వితరణతో అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. **తాడేపల్లి:** ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ గుంటూరు జిల్లా తాడేపల్లిలోని కార్యాలయం ప్రాంగణంలో ఎన్‌టిఆర్‌కు ఘన నివాళులర్పించారు. తెలుగు చిత్ర పరిశ్రమ మనుగడకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఛాంబర్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజా వాసిరెడ్డి భూపాల్‌ప్రసాద్, జనరల్ సెక్రటరీ జె.వి.మోహన్ గౌడ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ జంగా చైతన్య, ట్రెజరర్ యమ్.శ్రీనాధరావు, జాయింట్ సెక్రటరీ పులి రమణారెడ్డి, ఈసీ మెంబర్ రవీంద్రనాథ్ ఠాగూర్ బాబు, నిర్మాత సభ్యులు బి.వి.రత్నం, శంకర్, విఠల్ పాల్గొన్నారు.

గన్నవరంలో...

పమిడిముక్కలలో...


ఉయ్యూరులో...



ఫిల్మ్ ఛాంబర్ ఆధ్వర్యంలో...

రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డలోని మోడ్రన్ రెడీమేడ్ షాప్ యజమాని కోసూరి రమేష్ బాబు (54) సోమవారం రాత్రి కరకట్టపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. రమేష్ బాబు విజయవాడ కాలేజీలో చదువుతున్న తన చిన్న కుమారైను చూసి కరకట్టపై కారులో తానే స్వయంగా డ్రైవింగ్ చేసుకుంటూ వస్తుండగా రాముడు పాలెం కే కొత్తపాలెం గ్రామాల మధ్య కరకట్టపై ప్రమాదవశాత్తు కారు చెట్టును ఢీకొనడంతో రమేష్ అక్కడికక్కడే మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. అటుగా వెళుతున్న కొందరు చూసి దగ్గరలోని పోలీస్ స్టేషన్కు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. రమేష్ అవనిగడ్డ ఎమ్మెల్యే కార్యాలయం పక్కన మోడరన్ రెడీమేడ్ బట్టల షాపు నిర్వహిస్తున్నారు. రమేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వివిధ విభాగాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పుస్తక పఠనం చిత్రలేఖనం డాన్స్ స్పోకెన్ ఇంగ్లీష్ తదితర అంశాలు నేర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు లెమన్ అండ్ స్పూన్ గేమ్ పోటీ కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు ఎం ఉషారాణి, కే.స్నేహ, సిహెచ్ గోపి పాల్గొని విద్యార్థులకు శిక్షణ ఇవ్వగా గ్రంథాలయ అధికారి జె ప్రభుదాస్, వి శ్రీదేవి పర్యవేక్షించారు.

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ ఏపీఎస్ఆర్టీసీ డిపోలో బుధవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కె.హనుమంతరావు తెలిపారు. ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని హనుమంతరావు చెప్పారు. అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలోని ప్రజలు తమ ప్రయాణ అవసరాలపై సూచనలు సలహాలు ఫోను ద్వారా ఇవ్వాలని కోరారు. ప్రయాణికులు 9959225466 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

వేతనాలు పెంచాలని టింబర్ కార్మికుల వినతి

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకొని కార్మికులకు కూడా పనికి తగ్గ వేతనాన్ని పెంచి ఇవ్వాలని యాకమూరు సుధీర్ టింబర్ డిపో సామిల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో యాజమాన్యానికి మంగళవారం వినతి పత్రం అందించడం జరిగింది. సామిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వల్లూరు శివనాగబాబు, ప్రధాన కార్యదర్శి ఎం.శివకృష్ణ కార్మికులకు వేతనాన్ని పెంచాలని యాజమాన్యాన్ని కోరారు. నేడు నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, ఫీజులు అడ్డుఅదుపు లేకుండా పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య ఖర్చులు భారీగా పెరిగిపోయాయని తెలిపారు. పెట్రోలు, గ్యాస్, కరెంటు, ఇంటికి అద్దెలు చెల్లించాలంటే యాజమాన్యం ఇస్తున్న వేతనాలు కార్మికులకు ఏమాత్రం సరిపోవటం లేదని చెప్పారు. యాజమాన్యం వారు స్పందించి ధరలను గుర్తించి కార్మికులకు న్యాయమైన వేతనాలు చెల్లించాలని కోరారు. ప్రతి కార్మికుడికి మెడికల్ క్లెయిమ్స్, వసతి ఏర్పాటు చేయాలని అన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ వసతులు కల్పించాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

వైద్యం వికటించి గర్భిణి మృతి

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ ప్రైవేటు వైద్యుల నిర్లక్ష్యంతో గర్భిణి మరణించిన సంఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. కోడూరు మండలం మందపాకల సచివాలయంలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్న కర్ర రాజ్యలక్ష్మికి ఏడాది క్రితం వివాహం జరిగింది. ఆమె గర్భం దాల్చడంతో అవనిగడ్డలోని గాంధీ క్షేత్రం సమీపంలో గల ప్రముఖ తల్లి పిల్లల ఆసుపత్రిలో చూపిస్తున్నారు. నెలలు నిండడంతో ఆసుపత్రిలో చేరిన ఆమెకు వెంటనే ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల సంతకాలు చేయించుకున్న వైద్యులు రాజ్యలక్ష్మికి ఆపరేషన్ చేశారు. ఆడపిల్ల జన్మించింది. ఆపరేషన్ చేసిన రెండు మూడు గంటల్లోనే వైద్యం వికటించడంతో రాజ్యలక్ష్మి పరిస్థితి విషమించింది. దీంతో మెరుగైన వైద్యం కోసం చల్లపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి ఆ తరువాత మచిలీపట్నం ఆంధ్ర ఆసుపత్రికి అక్కడ నుంచి విజయవాడలోని ఆంధ్ర ఆసుపత్రికి తరలించారు. రెండు రోజులు గడిచినప్పటికీ రాజ్యలక్ష్మి ఆరోగ్య పరిస్థితిలో ఎటువంటి మార్పు రాలేదు. ఈ విషయాన్ని బంధువులు అవనిగడ్డ వైద్యులకు తెలపగా వైద్యులకు దగ్గర బంధువైన ఓ విద్యాసంస్థల అధినేత అక్కడకు చేరుకుని వైద్య ఖర్చులతో పాటు నష్టపరిహారం చెల్లిస్తామని, ఆసుపత్రికి చెడ్డ పేరు వస్తుందని బంధువులపై ఒత్తిడి చేశారు. అదే ఆసుపత్రిలో ఇటీవల ఇదే తరహాలో ఒక మహిళ మరణించగా ఆ కుటుంబ సభ్యులకు గుట్టుచప్పుడు కాకుండా మూడు లక్షలు చెల్లించినట్లు సమాచారం. ఈ సంఘటనలపై జిల్లా కలెక్టర్, వైద్య శాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి ఇందుకు బాధ్యులైన వైద్యులపై చర్యలు తీసుకోవాలని బంధువులు కోరుతున్నారు.

రాజ్యలక్ష్మి (ఫైల్)

అక్రమ లే అవుట్లు

అక్రమార్కులకు అడ్డాగా నందిగామ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అక్రమార్కులకు అడ్డాగా మారుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి ఉదాహరణగా కార్యాలయం చుట్టు వెలసిన ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన ప్రైవేటు అడ్డాలు కనిపిస్తున్నాయి. వివిధరకాల పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన సమాచారం ఇచ్చేందుకు రిసెప్షన్ కౌంటర్ లేదు. కనీసం కార్యాలయంలో ల్యాండ్ వేల్యూయేషన్, నకళ్ళు, ఇతర పత్రాలకు సంబంధించిన అప్లికేషన్ కూడా దొరకవు. వీటిని వినియోగదారులు బయట ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన అడ్డాల్లో కొనుగోలు చేయవలసి వస్తుంది. ఆ అప్లికేషన్లకు వెళ్ళిన వినియోగదారులను మీరు వెళ్లకుండానే మీకు కావాల్సినవన్నీ తెచ్చిస్తామని ప్రభుత్వ రుసుము కన్నా ఎక్కువ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలో ఆన్లైన్ రిజిస్ట్రేషన్‌లో జరగవలసి ఉండగా వీటిని సైతం ఆమె ఆన్లైన్ చేసి రిజిస్ట్రేషన్ చేయిస్తామని వివిధ రకాలుగా ప్రభుత్వం విధించిన రుసుముల కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. అదేమని అడిగితే మొత్తం మాకే కాదని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో మామూళ్లు ఇవ్వాలని చెబుతూ వినియోగదారుల దగ్గర ముక్కు పిండి మరి వసూలు చేస్తున్నారు. ఈ స్టాంప్ పేరిట స్టాంప్ వెండర్లు రూ.పది స్టాంపుకి రూ.20, రూ.20 స్టాంపుకి రూ.30లు, రూ.వంద స్టాంపుకి రూ.130 నుండి రూ.150 వరకు వసూలు చేస్తున్నారు. నకళ్ళు, వివిధ సేవలకు ఆన్లైన్ చలానాలు తీయవలసి ఉండగా కార్యాలయం చుట్టూ ఉన్న ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ రుసుముల కన్నా రెండింతలు వసూలు చేసి చలానాలు తీసి ఇస్తున్నారు. ఈ కార్యాలయంలో జరిగే ప్రతి రిజిస్ట్రేషన్‌కు వినియోగదారుల వద్ద ప్రభుత్వ రుసుముల కన్నా ఒకటి నుండి రెండు పర్సెంట్ వసూలు చేస్తున్నారు.

సిఆర్‌డి ఏ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత నందిగామ చుట్టుపక్కల ప్రాంతంలో సీఆర్డీఏ అనుమతులు లేకుండా వేసిన ప్రైవేటు వెంచర్లలో ప్లాట్లను అక్రమ పద్ధతిలో కార్యాలయం చుట్టుపక్కల ఉన్న ప్రైవేటు ఏజెంట్లుగా చెప్పుకునే కొంతమంది కార్యాలయంలోని ఒక కీలక వ్యక్తి ద్వారా రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు సమాచారం. కార్యాలయానికి రిజిస్ట్రేషన్ నిమిత్తం వచ్చిన వినియోగదారుడు ఇచ్చిన సమాచారం మేరకు సంబంధిత స్థలాన్ని కానీ ఇల్లును కానీ కార్యాలయం సిబ్బందిలో ఒకరు స్వయంగా చూసి ఆ తర్వాత మాత్రమే రిజిస్ట్రేషన్ చేయవలసి ఉంటుంది. అయితే అధికారికంగా కార్యాలయం చేయవలసిన పనులను కార్యాలయం చుట్టూ ఉన్న ప్రైవేటు వ్యక్తులే చేస్తూ వీటిని అక్రమ పద్ధతుల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు సమాచారం. కొన్ని సంవత్సరాల క్రితం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అన్ని రకాల పనులు చేసేందుకు ప్రభుత్వం కొంతమంది వ్యక్తులకు లైసెన్సులు మంజూరు చేసింది. అయితే ఈ లైసెన్స్ వ్యక్తులు కార్యాలయాల విధుల్లో అనధికారి జోక్యం చేసుకుంటూ చలానాల విషయంలోనూ స్టాంపులు విషయంలోనూ భారీ కుంభకోణాలకు పాల్పడిన సంఘటనలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించడంతో ప్రభుత్వం వారిని తొలగించింది. అయినప్పటికీ వారు నేటికీ కొనసాగుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ప్రైవేటు వ్యక్తులు బడాబడా కార్యాలయం ఏర్పాటు చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి పనికి అధిక రేట్లు వసూలు చేస్తూ పనులు చక్కబెట్టుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా నందిగామ సబ్ రిజిస్టర్ కార్యాలయం పక్కనే ఉన్న ప్రైవేటు వ్యక్తుల కార్యాలయంపై సంబంధిత అధికారులు నిఘా ఏర్పాటు చేసి వారు చేస్తున్న అవినీతి కార్యకలాపాలను నిరోధించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - తిరువూరు : పర్యావరణ పరి రక్షణపై తిరువూరు వసుధ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వ ర్యంలో మంగళ వారం విద్యా ర్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిం చారు. స్థానిక శ్రీనిధి జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన పోటీల్లో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని సొసైటీ డైరెక్టర్ దుబ్బాకు ఆనందరావు తెలిపారు.

విద్యార్థులకు నీతి కథలు

ప్రజాశక్తి - గంపలగూడెం : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు నీతి కథలు నేర్పించినట్లు పెనుగొలను గ్రంథాలయ శాఖ అధికారి శ్రీలత తెలిపారు. చిన్నతనంలో నేర్చుకున్న నీతి కథలు జీవితా నికి అవసరమైనప్పుడు మంచి చేస్తాయని విద్యార్థులకు వివరిం చారు. గంపల గూడెం గ్రంథాలయ శాఖలో అధికారి సుంకర నాగేశ్వరరావు విద్యార్థులకు నీతి కథలతో పాటు ఇతర అంశాలు తెలిపినట్లు వివరించారు.

ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న నాగరాజు

ఉపాధి హామీ చట్టం నిర్వీర్యానికి ప్రయత్నం

ప్రజాశక్తి - విసన్నపేట : ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు విస్సంపల్లి నాగరాజు అన్నారు. మండలంలోని మారేమండ గ్రామంలో ఉపాధి హామీ పని ప్రాంతంలో ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకొని వారితో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ నిధులు తగ్గించుకుంటూ వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీని కాపాడాల్సిన ప్రభుత్వం ఇలా చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గద్దల రామకష్ణ, ఉపాధి కార్మికులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - తిరువూరు : ఎన్నికల నియమావళి ఉల్లంఘించి గ్రామాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తిరువూరు సీఐ అబ్దుల్ నబీ హెచ్చరించారు. మంగళ వారం తిరువూరు పట్టణంలో, మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు ఎన్నికల నియమావళి పై ప్రజలకు అవగాహన కల్పించారు. 144 సెక్షన్, పోలీస్ చట్టం 30 అమల్లో ఉన్నందున నలుగురి కంటే ఎక్కువమంది గుమికూడరాదని, అనుమతి లేకుండా సభలు సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. బాణాసంచా కాల్చ డం, డిజె సౌండ్ వినియోగించడం నిషేధమన్నారు. సామాజిక అశాంతి కలిగించే కార్యక్రమాలు నిర్వహించడం, వాట్సాప్ సందేశాలు పంపడం వంటి చర్యలకు పాల్పడితే వారిపై చట్టపకారం కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో తిరువూరు సెక్టార్-1 ఎస్ఐ సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

దీక్ష కళాశాల అధినేత రజీమ్ మృతి

ప్రజాశక్తి కంచికచర్ల : కంచికచర్లకు చెందిన దీక్ష కళాశాల అధినేత వైసిపి మైనారిటీ సెల్ నాయకుడు షేక్ రజీమ్(47) సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆదివారం అర్ధరాత్రి గుండెపోటు రావటంతో కుటుంబ సభ్యుల హుటాహుటిన విజయవాడలో ఆసుపత్రికి తరలించారు. సోమవారం సాయంత్రం వరకు కొద్దిగా కోలుకున్న ఆయనకు సోమవారం రాత్రి మరోసారి గుండెపోటుతో రావడంతో పాటు మెదడులో రక్తం గడ్డకట్టింది. పరిస్థితి విషమించి మృతి చెందారు. కంచికచర్లలో 10 ఏళ్లుగా దీక్ష కళాశాల నడుపుతూ ఈ ప్రాంత ప్రజలకు సుపరిచితులు. 2019 నుండి వైసిపి తరుపున క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చారు. నందిగామ వైసిపి అభ్యర్థి, డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్‌కు అత్యంత ఆప్తులు. రజీమ్ భార్య నందిగామ ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సింగ్ వృత్తిలో పని చేస్తున్నారు. పెద్ద కుమార్తె మెడిసిన్ పూర్తిచేసి హౌస్ సర్జన్‌గా పనిచేస్తుండగా, రెండో కుమార్తె బిటెక్ చదువుతోంది.

రజీమ్‌కు పలువురి నివాళి

దీక్ష కళాశాల అధినేత షేక్ రజీమ్ మృతి వార్త తెలియగానే బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలషులు, దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతి విషయం తెలియగానే నందిగామ సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు మంగళవారం కంచికచర్లలో రజీమ్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. చిన్న వయసులోనే రజీమ్ మృతి బాధాకరమన్నారు. మంచి ఆప్తుడిని కోల్పోయానన్నారు. నందిగామ చైతన్య కళాశాల అధినేత అమరనేని రమేష్, కంచికచర్ల సర్పచ్ వేల్పుల సునీత, ఎంపిపి బషీర్, ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు, వైసిని నాయకులు నంబూరు పెదబాబు, వేల్పుల శ్రీనివాస్, యోహాన్, ఆదిత్య, శేషం వాసూబాబు, పలు కళాశాల అధినేతలు, అధ్యాపకూలు, విద్యార్థులు రజీమ్ మృతదేహాన్ని సందర్శించి పూల మాల వేసి నివాళులర్పించారు.

రజీమ్‌కు నివాళులర్పిస్తున్న మొండితోక జగన్మోహన్‌రావు, అరుణ్

కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కిశోర బాలికలు అపోహలు వీడాలి

ప్రజాశక్తి - తిరువూరు : యుక్త వయసులో ఉన్న బాలికలు తమ శారీరక సమస్యలపై అపోహలు విడనాడాలని తిరువూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ రేష్మా బేగం సూచించారు. స్థానిక అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లో రుతుక్రమం ఆరోగ్యం -పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించారు. రుతుక్రమం అనేది ఎటువంటి అనారోగ్యం కాదని, ఈ సమయంలో ఆడవారిని తాకరాదని, వంట చేయరాదని, బాలికలు పాఠశాలకు వెళ్ళకూడదని కొందరు భావించడం సరికాదన్నారు. రుతుక్రమం సాధారణంగా వయసురీత్యా వచ్చే శరీరక ప్రక్రియగా భావించాలని, ప్రతి ఆడపిల్లలో 10 నుంచి14 సంవత్స రాల నడుమ ఈ రుతుక్రమం ప్రారంభమై 50 సంవత్సరాల వరకు కొనసాగుతుందని వైద్యాధికారి తెలిపారు. రుతుక్రమ సమయంలో శారీరిక, మానసిక ఇబ్బందుల్లో ఉన్న బాలికలకు, ఆడవారికి కుటుంబ సభ్యులు తగు మానసిక దృఢత్వాన్ని కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు కె.రవి, హెల్త్ విజిటర్ ఆషాబీ, సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, ఆశా వర్కర్లు, కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - విసన్నపేట : విస్సన్నపేట మండలం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా పండ్లు, ఒఆర్ఎస్, బ్రెడ్డు పంపిణీ చేశారు. విస్సన్నపేట శ్రీ లలితా సూపర్ మార్కెట్ సౌజన్యంతో పంపిణీ చేసిన ఈ కార్యక్రమంలో లలితా సూపర్ మార్కెట్ నిర్వాహకులు కె.రామకృష్ణ టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఆకుల రాధాకృష్ణ, మేసుపాం రవీంద్ర బొడ్డు భూషణం ఇల్లా రెడ్డయ్య జనసేన నాయకులు తోట కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న రామకృష్ణ

శామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో పోటీ ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : అత్యంత ముఖ్యమైన సమస్యలకు పరిష్కారాలను కనుగొనడంలో సహాయపడేందుకు 'సాల్వ్ ఫర్ టుమారో' అంటూ వినూత్న పోటీని శాంసంగ్ ప్రారంభించినట్లు శాంసంగ్ రీజనల్ ప్రతినిధి ఎం.రాజశేఖర్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. పర్యావరణ అనుకూల భవిష్యత్తును నిర్మించడంలో నాయకత్వం వహించడానికి యువ ఆవిష్కర్తలకు ఆహ్వానాన్ని అందజేస్తుందన్నారు. 'సాల్వ్ ఫర్ టుమారో' ప్లాట్‌ఫారమ్ పురోగతిని తీసుకురావడం కోసం వినూత్న కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 'సాల్వ్ ఫర్ టుమారో' రెండు విభిన్నమైన నేపథ్యాలతో స్కూల్ ట్రాక్, యూత్ ట్రాక్ అంటూ విద్యార్థులందరికీ సమాన అవకాశాలు అందించేలా జరుగుతుందన్నారు.



గన్నవరంలో ధరల దోపిడీ

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం మార్కెట్ లో నిత్యావసర వస్తువుల ధరల దోపిడీ సాగుతోందని వినియోగదారులు చెబుతున్నారు. విజయవాడలో లేని రేట్లు ఇక్కడ ఉంటున్నాయని అంటున్నారు. వ్యాపారుల తీరు వల్ల ధరలు విపరీతంగా పెరిగాయనే మాట వినిపిస్తోంది. రైతు బజార్లో రేట్లు, గన్నవరంలో రే ట్లు విని జనాలు పరేషాన్కు గురవుతున్నారు. కొన్ని సరుకుల రేట్లు వింటే కంగు తినాల్సిందే. ధరల నియంత్రణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కనీసం దుకాణాలపై దా డులు చేసి రేట్లు పరిశీలించిన పరిస్థితి లేదు. ఇలాగైతే కష్టమని మహిళలు అంటున్నారు. మంచి నూనెలు, పప్పులు, సబ్బులు, ఇతర సరకుల ధరలు విపరీతంగా పెంచేశారు. గత నెలరోజుల్లో ధరలు రోజూ పెరుగుతూనే ఉన్నాయి. పెట్రోల్ ధరలు పెరిగినప్పుడల్లా సరకుల ధరలు పెంచు తున్నారని చెబుతున్నారు. గన్నవరంలో మాత్రం వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలు పెంచి జ నాలను దోపిడీ చేస్తున్నారని విమర్శిస్తున్నారు. కోడిగుడ్డ రూ.6, కంది పప్పు కిలో రూ.120, మంచినూనె రూ.160, పామాయిల్ రూ.115, బియ్యం రూ.50 ధరలు ఉన్నాయ. సరుకుల రేట్లపై అభిప్రాయాలు..

ఎక్కడా లేని ధరలు గన్నవరంలోనే : లలిత

ఎక్కడా లేని రేట్లు గన్నవరంలో ఉంటున్నాయి. ఇక్కడ సరకుల ధర లు కూడా బాగా వసూలు చే స్తున్నారు. ఈవిధమైన దోపిడీ ఎక్కడా ఉండదు. అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో తె లియడం లేదు. దాడులు చేయకుంటే సామాన్యుల జీవనంచాలా కష్టమమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

ఈ దోపిడీకి అంతం ఎప్పుడో : వెంకటప్పయ్య

గన్నవరంలో ధరల దోపిడికి అంతం ఎప్పుడో తెలియడం లేదు. పామాయిల్ కిలో రూ.140కి ఎరగడంతో కూర వండలేని పరిస్థితి వ చ్చింది. మిగిలిన సరకుల ధరలు దిగ డం లేదు. ఈ ధ రలతో పేదలకు మరింత ఇబ్బంది అవుతుంది. సామాన్యులకు అన్నీ కష్టాలే అవు తున్నాయి. అ ధికారులు వరుసగా దాడులు నిర్వహించి బోర్డులు పెట్టించాలి.

సుబ్రమణ్యేశ్వరస్వామికి వెండి బహూకరణ

ప్రజాశక్తి-మోపిదేవి: మోపిదేవి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం రేచింతల గ్రామానికి చెందిన మనోహర్‌రెడ్డి గారి కుటుంబ సభ్యులు మంగళవారం స్వామిని దర్శించుకున్నారు. అనంతరం 2.700 కిలోల వెండి బిస్కెట్లు స్వామికి బహూకరించారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ సత్కరించారు. అలాగే గుంటూరు జిల్లా గురజాల నియోజకవర్గం టిడిపి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కంఠంనేని శివశంకర్ పాల్గొన్నారు.

సిపిఎం అభిమాని లలిత మృతి

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు ఉయ్యూరు చిన అంజయ్య భార్య ఉయ్యూరు లలిత (64) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ఆమెకు భర్త, ఇద్దరు మగ పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. సిపిఎం మండల నాయకులు బెజవాడ తాతబ్బాయి, గ్రామ నాయకులు సోమిశెట్టి శ్రీనివాసరావు, ఏడుకొండలు, కడవకొల్లు శ్రీనివాసరావు తదితరులు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. గ్రామంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

'విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి'

ప్రజాశక్తి-గన్నవరం: వేసవి సెలవులను విద్యార్థులు వృథా చేసుకోకుండా సద్వినియోగం చేసుకోవటం అభినందనీయమని రిటైర్డ్ హిందీ పండిట్ కంభంపాటి ధర్మారావు అన్నారు. స్థానిక గ్రేడ్-1 గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా క్యారమ్ బోర్డు, చెస్ వంటి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంభంపాటి ధర్మారావు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లడం అలవాటు చేసుకోవాలని తెలి పారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. గ్రంథాలయ ఇన్చార్జి డి.బాబూరావు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు చందమామ కథల పుస్తకం నుండి మిత్ర భేదం కథను చదివి వినిపించారు. అనంతరం డ్రాయింగ్, వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారిని టి వాణి తెలిపారు.

హజ్ యాత్రకు రెండో బృందం

ప్రజాశక్తి-గన్నవరం: పవిత్ర హజ్ యాత్రను రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి, చైర్మన్ హజ్ ఆపరేషన్స్ హర్షవర్ధన్ మంగళవారం మధ్యాహ్నం గన్నవరం ఈద్గా జామా మసీద్ హజ్ క్యాంప్ వద్ద పచ్చజెండా ఊపి ప్రారంభించారు. 322 మందితో రెండో బృందం మంగళవారం సాయంత్రం 4:55 గంటలకు విమానంలో జెడ్డా బయలుదేరి వెళ్లింది. వక్ఫ్ బోర్డ్ సీఈవో, హజ్ కమిటీ ఈవో అబ్దుల్ ఖదీర్, కమిటీ సభ్యులు సిఆర్డిఏ అదనపు కమిషనర్ అలీం బాష, దూదేకుల కార్పొరేషన్ ఎండి గౌస్ పీర్, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మస్తాన్ వలి, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాస్ హజ్ యాత్ర శు భప్రదం కావాలని, యాత్రికులకు అభినందనలు తెలిపారు.

అదే విధంగా 48 మందితో మూడో బృందం బుధవారం ఉదయం 7.10 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుండి బయలుదేరుతుంది.

సీతాదేవికి నివాళులర్పిస్తున్న చలసాని

సీతాదేవి మృతికి సంతాపం

ప్రజాశక్తి-గుడివాడ : యెర్నేని సీతాదేవి అకాల మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, సీనియర్ టిడిపి నాయకుడు పిన్నమనేని బాబ్జీలు సంతాపం తెలిపారు. కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ఆమె ఎంతో కృషి చేశారని, చివరి రోజుల్లో సీతాదేవితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రోజులను తాము ఇప్పటికి మర్చిపోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ వైపు సమాజ సేవ చేస్తూనే, మరో వైపు రాజకీయాల్లో సీతాదేవి క్రియాశీలకంగా ముందు ఉండేవారన్నారు. మంచి వ్యక్తి అయిన సీతాదేవి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరారు. ఆమె కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, బాబ్జిలు ప్రగాఢ సంతాపం తెలిపారు.

గుడ్లవల్లేరు: కష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యులు, రాష్ట్ర మాజీ మంత్రి యెర్నేని సీతాదేవి భౌతికకాయాన్ని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు కోడూరు గ్రామంలో మంగళవారం సందర్శించి ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర్‌బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి పిన్నమనేని, బాబ్జీ

అన్నదానం

ప్రజాశక్తి-గుడివాడ: స్థానిక మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో డాక్టర్ నందమూరి ప్రభాకరరావు రత్నకుమారిల కుమారుడు నందమూరి మనోజ్, మనుమడు తోటకూర ఆర్య విష్ణుల (యు.ఎస్.ఏ) పుట్టినరోజు సందర్భంగా మానవతా అడ్వైజరీ బోర్డు సభ్యురాలు నందమూరి పద్మజ సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ దండమూడి జయలక్ష్మి, ఉమ్మడి కష్ణాజిల్లా చైర్మన్ పొట్లూరి వీర శేషగిరిరావు, వైస్ చైర్మన్ వేణుగోపాలరావు, కోశాధికారి అన్నపురెడ్డి గోపిరెడ్డి, కార్యవర్గ సభ్యులు, డైరెక్టర్ సీతారామస్వామి, అడ్వైజర్ బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన శిక్షణ

ప్రజాశక్తి-ఉయ్యూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మంగళవారం విదార్థులకు యోగ, క్లాసికల్ డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. యోగాసనాల వల్ల ఆరోగ్యం, డ్యాన్స్‌లో వ్యాయామం కలుగుతుందని గ్రంథాలయ అధికారి రమణి అన్నారు. ఈ సందర్భంగా టి.లాస్యశ్రీ చేసిన క్లాసికల్ డ్యాన్స్, యోగ చిన్నారులను ఆకట్టుకుంది. గ్రంథాలయా వల్ల ఉపయోగాలు, విజ్ఞానంపై గ్రంథాలయ అధికారి అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి దందా

పుల్లపాడులో అక్రమంగా జరుగుతున్న మైనింగ్

ప్రజాశక్తి-పెడన: పెడన మండల పరిధిలోని పుల్లపాడు పంచాయతీ దేవరపల్లి గ్రామంలో యథేచ్ఛగా మట్టి దందా కొనసాగుతుంది. 12 ట్రాక్టర్లు, ఒక జెసిబితో మూడున్నర ఎకరాల భూమిలోని బుసక మట్టిని వందలాది ట్రక్కుల్లో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా చూస్తున్న విఆర్ఓ తో పాటు రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర మొత్తం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ పెడన మండలంలో మాత్రం ఆచరణకు ఆమాడ దూరంలోనే ఉంది. సాక్షాత్తు జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ మండలంలోని రెవెన్యూ అధికారులకు ఉన్నతాధికారులు పలుమార్లు మెమోలు జారీ చేశారు. అయినప్పటికీ ఆయా అధికారుల్లో ఎలాంటి మార్పూ రాలేదు. నెలనెలా ప్రభుత్వ ఇస్తున్న వేతనం కన్నా మట్టి మాఫియా ఇస్తున్న మామూలే ఎక్కువగా అందుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే 24 పంచాయతీల్లోనూ తొమ్మిది పంచాయతీల వీఆర్వోలకు రెండేసి సార్లు చొప్పున మెమోలు కూడా జారీ చేశారు. అలాగే మండల స్థాయి అధికారులకు నోటీసులు జారీ చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ నిత్యం మట్టి మాఫియా బడా బాబులు ఇచ్చే మామూళ్లకు తలొగ్గి వారికి సహకరిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టి మాఫియా యజమానులు, సంబంధిత రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని, మట్టి దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

కొనసాగుతున్న వేసవి శిక్షణా శిబిరం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పౌర గ్రంథాలయ సంచాలకులు వారి ఆదేశానుసారం పట్టణంలోని గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులచే కథలు, సుమతి, వేమన శతక పద్యాలు చదివించారు. ఉపాధ్యాయుడు వినోద్‌బాబు ఇంగ్లీష్ గ్రామర్ వెర్బ్స్, ప్రోనౌన్ నేర్పించారు. పిఇటి ఉపాధ్యాయురాలు మణిరత్నం విద్యార్థులకు ఆహారం, పౌష్టికాహారం అలవాట్లుపై ఎలాంటి ఆహారం తీసుకోవాలి, బలమైన ఆహారంతీసుకోవాలి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శ్రీమతి ఆలేటి ప్రభ, సిబ్బంది శ్యామల, రమేష్, సత్యవతి, ఉపాధ్యాయుడు డి.బాబూరావు, వర్షిత పాల్గొన్నారు.

చిత్రాలు గీసిన చిన్నారులు

పలు అంశాలపై అవగాహన

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు, ప్రథమశ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. అంతర్జాతీయ మహిళా ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరువూరు జిల్లా పరిషత్ పాలకొన్నత పాఠశాల ఉపాధ్యాయిని ఈ భరతకుమారి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఏ కుటుంబం అయినా ప్రశాంతమైన వాతావరణంలో నిరంతరం ఉంటుందని చెప్పారు. అనంతరం విద్యార్థులతో పుస్తకాలు చదివించి జాతీయనాయకుల గురించి వివరించారు. గానుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయులు ఎం.రాంప్రదీప్ స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించారు. డీపీస్ సరిత మోటివేషన్ క్లాస్ (యూట్యూబ్‌లో) కాకి, కొంగ జపంలా కథలను స్పీకర్ ద్వారా విద్యార్థులకు వినిపించారు. వివిధ రకాల బొమ్మలు ఎలా చేయాలనేది చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిని పద్మావతి సిబ్బంది పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో

ఉపన్యాసకులుగా శిక్షణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : నేటి సమాచార యుగంలో మంచి ఉపన్యాసకులుగా తయారవ్వాలంటే దానికి సంపూర్ణ శిక్షణ అవసరం. అటువంటి శిక్షణను ఉచితంగా అందించడానికి తెలుగు రాష్ట్రాలలోనే ప్రఖ్యాతిగాంచిన ఉపన్యాసకులు, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు ఆధ్వర్యంలో మే 30, 31 తేదీల్లో ఉచితంగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమం గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామంలోని రమణారావు, సావిత్రమ్మ ధ్యాన ఆరోగ్య ఆశ్రమంలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. శిక్షణ జరిగే రెండు రోజులు ఉచితంగా వసతి, భోజన సదుపాయాలు నిర్వాహకులే ఏర్పాటు చేస్తున్నారు. ఔత్సాహికులైన వారు తమ తమ వృత్తుల్లో నిష్ణాతులుగా వెలుగొందాలంటే తప్పకుండా ఈ ఉచిత వక్త శిక్షణ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని, మరిన్ని వివరాలకు పేరు రిజిస్ట్రేషన్ కొరకు స్థానిక విశ్వ భారతి డిగ్రీ కళాశాల డైరెక్టర్, సైకాలజిస్ట్ జల్లా తిరుపతిరావును (9848383398) సంప్రదించాలని తెలిపారు.

పంటల మార్పిడితో రైతులకు మేలు

దుక్కు దున్నుతున్న రైతులు

మిరప తోట

ప్రజాశక్తి - వత్సవాయి : ఈ సంవత్సరం పంటలు వేయటానికి రైతులు సన్నద్ధమయ్యారు. మే నెల పూర్తికావస్తుండటంతో జూన్ ప్రారంభంలో మొదలు పెడతారు. రైతులు ప్రతి సంవత్సరం సాగు చేసే పంటలతో భూమిలో రెండింతలు సారం తగ్గి దిగుబడులు తగ్గుతాయి. ప్రతి సంవత్సరం ఒకే పంట వేయకుండా పంటల మార్పిడిపై దృష్టి సారించాలని వ్యవసాయాధికారులు రైతులకు పలు సూచనలు ఇస్తున్నారు.

మొక్కజొన్న పొలంలో మిరప వేయకూడదు

మొక్కజొన్న వేసిన పొలంలో మిరప పంట సాగు చేయకుండా ఉంటే మంచిదని అధికారులు సూచిస్తున్నారు. మిరప పంట సాగు చేస్తే నష్టం తప్ప లాభాలు వచ్చే అవకాశం లేదన్నారు. పత్తివేసిన పొలంలో మిరప పంట వేస్తే లాభసాటిగా ఉంటుందన్నారు. మిరప పంట వేసిన పొలంలో పత్తి పంట సాగు చేస్తే పెట్టుబడులు తగ్గిపోవడంతో పాటు నూగు కూడా పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా మిరప పంట సాగు చేయటానికి ముందు సదరు భూమిలో జొన్న, పిల్లి పెసర వంటి పంటలను సాగు చేసి దాన్ని ట్రాక్టర్ ద్వారా తొక్కించి అనంతరం పంటను సాగు చేస్తే భూసారం పెరిగి చీడ పట్టకుండా ఉంటుందని అన్నారు. నులిపురుగులు ఉన్న ప్రాంతాల్లో టమాట, బెండ, పెసర, మినుము పంటలు వేస్తే అవి వాటిని మరింత అభివృద్ధి చేస్తాయని అన్నారు. పంట మార్పిడిలో భాగంగా నేలంతా పూర్తిగా కప్పే పంటలను చేసుకోవాలని తెలిపారు. వేరుశనగ, బొబ్బర్లు, పెసర, మినుము, పంటలు వేయడంతో నేలను పూర్తిగా కప్పి ఉంచుతాయని దీనివల్ల కలుపు మొక్కలు అధికంగా కాకుండా ఉంటాయని తెలిపారు. వరి పంట తర్వాత పప్పు ధాన్యాలు పంటలు పంటను సాగు చేయడం ద్వారా ఊరికి తెగులు ఆశించకుండా ఉంటాయని తెలిపారు. భూమిలో తేమ ఎక్కువ కాలం నిలువ చేసే శక్తి ఉన్నప్పుడు ఏడాదిలో రెండు పంటలు పండించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఇసుక, నేలల్లో మిశ్రమ పంటలను సాగు చేసుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

చీడ పీడల వ్యాప్తి తగ్గుదల : వ్యవసాయాధికారి రవికుమార్

పంట మార్పిడి చేయకపోవడంతో చీడ పీడల వ్యాప్తి ఎక్కువయ్యే అవకాశం ఉందని మండల వ్యవసాయ శాఖాధికారి రవికుమార్ తెలిపారు. పంట మార్పిడితోనే అధిక ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. పంట మార్పిడి ఫలితంగా సస్య రక్షణకు వినియోగించే మందుల ఖర్చు తగ్గిపోతుందని తెలిపారు. పంట మార్పిడి విధానంతో భూమిలో సారం పెరిగి దిగుబడులు కూడా బాగా పెరుగుతాయని అన్నారు.

ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - భవానీపురం : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారకరామారావు 101వ జయంతి వేడుకలు 42వ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు శివాజీ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రధాన కార్యదర్శి పెద్ది సతీష్ యూనిట్ ఇన్చార్జి హనుమంతరావు, కోడెబోయిన స్రవంతి, మరియు ఎన్టీఆర్ జిల్లా రజక సంఘం అధ్యక్షులు ముదిగొండ శివ, ఎన్టీఆర్ జిల్లా పార్లమెంటు మహిళా నాయకురాలు మొవ్వ విజయ, తదితరులు పాల్గొన్నారు. చిట్టినగర్లో గల మిల్క్ ఫ్యాక్టరీ ఆవరణలో స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి 101 వ జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. మిల్క్ ఫ్యాక్టరీ ఆవరణలో గల ఎన్.టి.ఆర్ కాంస్య విగ్రహానికి కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భముగా చైర్మన్ మాట్లాడుతూ మ్యాక్స్ చట్ట రూపకర్త, సహకార రంగ స్ఫూర్తి ప్రదాత, సహకార రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమములో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర బాబు, సమితిబోర్డు డైరెక్టర్లు ఉయ్యూరు అంజి రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పశ్చిమ నియోజకవర్గం బుద్దా వెంకన్న టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టిడిపి నాయకులు చెన్నుపాటి శ్రీనివాసరావు చేతుల మీదగా కేక్ కట్ చేశారు. **జగ్గయ్యపేట :** పట్టణంలో టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య నివాసంలో అన్న నందమూరి రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పట్టణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి అన్న ప్రసాద వితరణ చేశారు. **కంచికచర్ల :** స్థానిక టిడిపి కార్యాలయంలో మండల టిడిపి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ చిత్ర పటానికి మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, నాయకులు గుత్తా రత్నం, వేమా కిషోర్, వెంకట్రావు, ఆర్‌ఎస్‌పి బాబు, అన్నదాత కృష్ణ, తాడపనేని లక్ష్మణరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదురుగా గల ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ రాజ్ కుమార్, ఉప సర్పంచ్ గోగినేని అమర్‌నాథ్, మాజీ సర్పంచ్ గుదే రంగారావు తదితరులు పూల మాల వేసి నివాళు లర్పించారు. పరిటాలలో మాజీ సర్పంచ్ మాగంటి బాబు, గని ఆత్కూరులో నాయకులు పాల్గొన్నారు.కీసరలో వేడుకలు నిర్వహించారు. **పెనుగంచిప్రోలు :** మండల టిడిపి కార్యాలయంలో మంగళవారం మండల టీడీపీ అధ్యక్షులు చింతల సీతారామయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ జడ్‌పిటిసి గజ్జి కృష్ణమూర్తి నివాళులర్పించారు. ఆలయ మాజీ చైర్మన్లు కాకాని. శ్రీనివాసరావు. కర్ల. వెంకట నారాయణ. ముక్కపాటి. ప్రసాద్. కేక్ కట్ చేశారు. అనంతరం. కార్యకర్తల కు స్వీట్లు పంపిణీ చేశారు. **రెడ్డిగూడెం:** రెడ్డిగూడెం మండల కేంద్రంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. **తిరువూరు :** బైపాస్ రోడ్డులోని టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గద్దె వెంకటేశ్వరరావు, సంకురాత్రి జనార్దనరావు, డాక్టర్ జయసింహ, తదితరులు పాల్గొన్నారు. **గంపలగూడెం :** స్థానిక గాంధీ సెంటర్లో ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆర్.వీరారెడ్డి ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టౌన్ పార్టీ అధ్యక్షుడు కాజా రవికుమార్, గ్రామ సర్పంచ్ కె.పుల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు. **నందిగామ :** నందిగామ టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్ర పఠానికి పార్టీ నాయకులు నివాళులర్పించారు. లచ్చపాలెం గ్రామంలో ఎన్టీఆర్ జయంతి సందర్భంగా టిడిపి గౌస్ సౌజన్యంతో వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. వృద్ధుల సమక్షంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. మాగల్లు గ్రామంలో కెకె వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఆల్ ఇండియా ఎన్టీఆర్ అభిమాన సంఘ ఉపాధ్యక్షులు వడ్డెల్లి సాంబశివరావు, సీనియర్ టిడిపి నాయకులు కొండూరు వెంకటరమణ, ఏపూరి నాగేశ్వరరావు, తోట చర్ల నాగేశ్వరరావు, తోటకూర సూర్యనారాయణ, గర్నిడి సురేష్, నాగ శ్రీను తదితరులు పాల్గొన్నారు. కంచెల, ఐతవరం, అంబారుపేట కొండూరు, తొర్రగుంటపాడు గ్రామాల్లో టిడిపి మండల అధ్యక్షులు వీరంకి వీరస్వామి, ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వరరావు, మాజీ ఎంపీపీ మన్నెం కళావతి, సర్పంచ్ చెరుకూరి హైమారావు, గర్నిడి సురేష్ తదితరులు టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఏచూరి రాము, కాసర్ల లక్ష్మీనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్, సీనియర్ టిడిపి నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు ,పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వన్‌టౌన్‌లో...

గంపలగూడెంలో...

పెనుగంచిప్రోలులో...

నందిగామలో...

తిరువూరులో...

మాట్లాడుతున్న ఎసిపి మురళీకృష్ణారెడ్డి

ఓట్ల లెక్కింపు విధివిధానాలపై అవగాహన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం ముత్తవరపు కల్యాణ మండపం నందు మంగళవారం అన్ని రాజకీయ పార్టీలతో విజయవాడ పశ్చిమ డివిజన్ ఏసిపి పి మురళీకష్ణారెడ్డి, సిఐ ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్నికల కౌంటింగ్ విధి విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసిపి మురళీకష్ణారెడ్డి మాట్లాడుతూ 2024 సాధారణ ఎన్నికల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేందుకు నియమ నిబంధనలను కఠిన తరం చేసిందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి విజయవాడ పార్లమెంట్‌అ ఏడు సెంబ్లీ నియోజకవర్గాల వారీగా జూన్ 4న ఇబ్రహీంపట్నం జూపూడిలోని నోవా నిమ్రా కళాశాలలో లెక్కింపు ప్రక్రియ జరుగుతుంది అన్నారు. ఎన్నికల కోడ్, సెక్షన్ 144, సి ఆర్ పి సి సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున బహిరంగ సభలు సమావేశాలు ర్యాలీలు నిషేధమన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి వచ్చే ఏజెంట్లు కౌంటింగ్ ప్రదేశానికి సంబంధించి కేటాయించిన నిర్ణీత దూరంలో, నిర్దేశించిన ప్రదేశంలో పార్టీ చేసుకోవాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లే ఏజెంట్లకు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రకారం నడుచుకోవాలని నిషేధిత వస్తువులు లెక్కింపు కేంద్రాల్లోకి తీసుకు వెళ్ళకూడదు అన్నారు. లెక్కింపు కేంద్రాల బయట లేదా రోడ్లమీద విజయోత్సవ ర్యాలీలు చేయడం అన్నారు ఏ రాజకీయ పార్టీ జన సమీకరణ చేయకూడదని సూచించారు. పార్టీ ఆఫీసుల్లో, ఫంక్షన్ హాల్స్‌లో, సెంటర్ల వద్ద, ఎల్ఈడి స్క్రీన్ పెట్టి జన సమీకరణ చేయడం నిషేధం అన్నారు. సోషల్ మీడియాలో మరియు వాట్సాప్ గ్రూపులో రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ప్రజలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన బైండోవర్ కేసులు పెట్టడం జరుగుతుందని తెలియజేశారు. లెక్కింపు ప్రక్రియ భద్రత ఏర్పాట్లలో భాగంగా విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలను గుంటుపల్లి లోని సీఏ కన్వెన్షన్ హాల్ వద్ద, హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలకు సంబంధించి దొనబండ వద్ద మైలవరం వైపు నుంచి వచ్చే వాహనాలకు సంబంధించి శాంతినగర్ వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ఏజెంట్లు నాయకులు, ఎస్సై పాపారావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డి కె బాలాజీ జిల్లా పోలీసు అధికారి అద్నాన్ నయీం అస్మితో కలిసి మంగళవారం కష్ణ విశ్వవిద్యాలయం సందర్శించి ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలించారు.తొలుత అంబేద్కర్ అకాడమిక్ భవనం ఎదురుగా ఉన్న నూతన భవనాల్లో మీడియా సెంటర్లో టెలివిజన్ ఏర్పాటు చేయాలని, మీడియా వారికి రౌండ్ వారీగా ఎన్నికల ఫలితాలను అందించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి సూచనలు చేశారు.విశ్వవిద్యాలయంలోకి ప్రవేశించే ముందు ప్రతి ఒక్కరి వద్ద వాసులు ఉన్నాయా లేదా గమనించి లోపలికి అనుమతించాలన్నారు.అనంతరం అకాడమిక్ భవనంలో కమ్యూనికేషన్ రూమ్ ఏర్పాటు చేయాలని అందులో పబ్లిక్ అడ్రస్ సిస్టం, రౌండ్ వారీగా ఓట్ల లెక్కింపు ఫలితాలను ప్రదర్శించేలా చూడాలన్నారు.తదుపరి మచిలీపట్నం, పెడన, గుడివాడ, పామర్రు, అవనిగడ్డ, పెనమలూరు, గన్నవరం శాసనసభ నియోజకవర్గాలతో పాటు పార్లమెంటు అసెంబ్లీ సెగ్మెంట్ కౌంటింగ్ హాళ్లను వారు పరిశీలించారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు ఎలా రావాలి ఈవీఎంలు ఎలా తీసుకొని రావాలి, పార్లమెంటు అసెంబ్లీ కౌంటింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది ఎలా రావాలి పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ సిబ్బంది ఎలా రావాలి అనే విషయం పైన సంబంధిత రిటర్నింగ్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఆయా మార్గాల్లో జిల్లా ఎన్నికల అధికారి స్వయంగా వెళ్లి సంబంధిత గమ్యస్థానాలను సరిగా చేరుకుంటున్నామా లేదా అని పరిశీలించారు.కౌంటింగ్ హాల్లో శాసనసభకు 14 టేబుళ్ళు ,పార్లమెంటు అసెంబ్లీ సెగ్మెంట్కు 14 టేబుళ్ళు , ఆర్ ఓ పరిశీలకుల టేబుళ్ళు పరిశీలించారు.ఈ పర్యటనలో జిల్లా ఎన్నికల అధికారి వెంట డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, అదనపు ఎస్పీలు జి వెంకటేశ్వరరావు, ఎస్వీడీ ప్రసాద్, మచిలీపట్నం అవనిగడ్డ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ కార్యక్రమాలను ప్రారంభించిన అమెజాన్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

విభిన్నమైన, ప్రభావవంతమైన కార్యక్రమాల ద్వారా కమ్యూనిటీలకు సాధికారత కల్పించడంలో అమెజాన్ గణనీయమైన పురోగతిని కొనసాగిస్తోంది అని సంస్థ ఏరియా ఇంఛార్జి కె.ప్రతాప్ అన్నారు. నగరంలోని సంస్థ కార్యాలయం నందు అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ . దేశవ్యాప్తంగా 7.8 మిలియన్లకు పైగా ప్రజలను సానుకూలంగా అమెజాన్ ప్రభావితం చేసింది. అన్నారు. విస్తారమైన వనరులు, వినూత్న సామర్థ్యాలను ఉపయోగించుకోవడం ద్వారా, అమెజాన్ బీద వర్గాల ప్రజలకు అవసరమైన విద్య, నైపుణ్య శిక్షణను అందించడంపై దష్టి పెడుతుంది అని తెలిపారు.. అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ వంటి ప్రోగ్రామ్‌లు కంప్యూటర్ సైన్స్ విద్యలో అంతరాన్ని తగ్గించాలని, విభిన్న నేపథ్యాల నుండి వచ్చిన యువ విద్యార్థులకు వారి భవిష్యత్ కెరీర్‌ల కోసం కీలకమైన నైపుణ్యాలను పొందే అవకాశాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి అన్నారు.. నాణ్యమైన విద్యను పొందేందుకు ఆర్థిక అడ్డంకులు సవాలుగా మారకుండా ఉండేలా రూపొందించిన అనేక స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌లు ఈ విద్యా ప్రయత్నాలకు తోడ్పడు అందిస్తుంది అని తెలిపారు.

17 ద్విచక్ర వాహనాలు సీజ్

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: కృష్ణాజిల్లా ఎస్పీ అద్నాం నయీమ్ అస్మి ఉత్తర్వులు ప్రకారం గుడివాడ డిఎస్పి పి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో గుడివాడ రూరల్ సర్కిల్ పరిధిలోని గుడ్లవల్లేరు గ్రామం, మండలంలో గల కూరాడ లాక్డౌన్ నందు గుడ్లవల్లేరు మరియు గుడివాడ తాలూకా ఎస్ఐ లు మరియు సర్కిల్ సిబ్బందితో కలసి కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సోదాలు యెక్క ముఖ్య ఉద్దేశం ఎన్నికల అనంతరం కౌంటింగ్ వరకు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూసే క్రమంలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు ఈ ప్రాంతాలకు వచ్చి అల్లర్లు సష్టించకుండా, అదేవిధంగా మారణయూదాలు కలిగి ఉండకుండా చూడడం. అదేవిధంగా ఎవరైనా వారి వద్ద చట్ట వ్యతిరేకంగా డిపిఎల్‌గానీ ఎన్‌డిపిఎల్‌గానీ లిక్కర్ మరియు పెట్రోల్, డీజిల్ లాంటివి కలిగి ఉండడం వంటివి దష్టిలో పెట్టుకొని తనిఖీలు నిర్వహించారు ఈ తనిఖీలలో 17 ద్విచక్ర వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు సమర్పించకపోవడం గుర్తించినట్లు గుడివాడ రూరల్ సీఐ కె ఏసుబాబు తెలిపారు.

నేడు వైష్ణవిలో హెచ్‌సిఎల్ జాబ్‌మేళా

ప్రజాశక్తి - తెనాలి

ప్రముఖ సాఫ్ట్వేర్ కంపెనీ హెచ్‌సిఎల్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కంపెనీ కోఆర్డినేటర్ పి గుర్నాథ్ మంగళవారం చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో గురునాథ్ మాట్లాడుతూ 2023 మార్చి, 2024 మార్చి లో ఇంటర్ బైపిసి, సిఇసి, హెచ్ఈసిలో 75% కు పైబడి మార్కులు సాధించిన వారు జాబ్ మేళాకు అర్హులని చెప్పారు. ఎంపిక ప్రక్రియ మూడు దశలలో ఉంటుందని, ఎంపికైన వారికి తొలి ఏడాదిలో తొమ్మిది నెలల పాటు నెలకు రూ.10వేల స్టైఫండ్తో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రూ.14,500 ప్రారంభ వేతనంతో కంపెనీలో ఉద్యోగ అవకాశం కల్పిస్తారన్నారు. అలాగే జాబ్ చేస్తూనే పేరొందిన యూనివర్సిటీలలో డిగ్రీ చదువుకునేందుకు కంపెనీ ప్రోత్సహిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 7780754278, 986660 7774 నెంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు. సమా వేశంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాల మండల పరిధిలోని వీరమాచినేనివారి పాలెం గ్రామానికి చెందిన కొడాలి హరీష్ ఇటీవల గుండెపోటు వచ్చి విజయవాడలోని కామినేని ఆసుపత్రిలో చికిత్స పొంది మంగళవారం వారి స్వగహానికి తిరిగి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర తెలుగు యువత నాయకులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్న) మరియు జనసైనికులు కలిసి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ అధ్యక్షులు దాసం రామకష్ణ, కటారి తాతయ్యా, మాదాసు వినయ్, తాడికొండ సాయి తేజ, కొల్లా రిచిత్, కొండవీటి రవి తదితరులు హరీష్ స్వగహానికి వెళ్ళి వారిని పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు.

రాజకీయ పార్టీలు సంయమనం పాటించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం గెలిచిన, ఓడిన పార్టీ అభ్యర్థులు సంయమనంతో వ్యవహరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అన్ని విధాలా సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కోరారు. మంగళవారం ఆయన తన ఛాంబర్ లో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తో కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు వారి ఏజెంట్లతో ఓట్ల లెక్కింపు రోజున పాటించవలసిన జాగ్రత్తలను వివరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం వచ్చే జూన్ 4వ తేదీన కష్ణా యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఉదయం 8 గంటలకే మొదలవుతుందని, కేంద్రానికి ముందుగానే చేరుకోవాలన్నారు.అభ్యర్థులతో పాటు వారి ఏజెంట్లు సంబంధిత అధికారులకు వివరాలను అందించి ముందుగానే పాసులు పొందాలని సూచించారు.అదేవిధంగా ఓట్ల లెక్కింపు కోసం వచ్చే వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్లు, వారి వాహనాల కోసం వివరాలను అందించి పాసులు పొందాలన్నారు.ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు గాని లేదా ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు గాని ఎట్టి పరిస్థితులలో అనుమతించేది లేదని, తెచ్చిన ఫోన్లను మొబైల్ కౌంటర్ వద్ద విడిచి పెట్టవలసి ఉంటుందని తెలిపారు. గెలుపోటములు సహజమని, గొడవలు చేసినంత మాత్రాన ఫలితాలు తారుమారు కావని, ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలన్నారు. విజయం సాధించిన అభ్యర్థులు ఇతర అభ్యర్థులను ఉద్దేశించి కించపరుస్తూ మాట్లాడరాదని, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయిన అనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్ రూముకు చేర్చేంతవరకు అభ్యర్థులు వారి ఏజెంట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. ఈ ప్రక్రియను అంతా వీడియోగ్రఫీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఫలితాలు వెలువడిన అనంతరం గెలిచిన, ఓడిన అభ్యర్థులు, వారి ప్రతినిధులు గాని, అనుచరులు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎలాంటి గొడవలు, హింసకు పాల్పడరాదని, దీనిపై హితవు పలికే విధంగా వీడియో సందేశం పంపాలన్నారు.గెలిచిన తర్వాత ఊరేగింపులు, డీజేలు, లౌడ్ స్పీకర్లకు ఎలాంటి అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఓట్ల లెక్కింపు కేంద్రానికి వచ్చే వారు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎటువంటి ఆయుధాలతో ప్రవేశించరాదని, ఎవరూ ఎటువంటి మత్తు పానీయాలు సేవించి రాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సమన్వయ అధికారి దుర్గా కిషోర్, పోటీ చేస్తున్న అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్‌కు నివాళి

ప్రజాశక్తి-పెదపారుపూడి: టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ 101వ జయంతిని పురస్కరించుకుని పెదపారుపూడి మండలం వెంట్రుప్రగడ టిడిపి అధ్యక్షులు చలసాని రమేష్ (చౌదరి) ఆధ్వర్యంలో మంగళవారం కేక్ కట్ చేశారు. అనంతరం ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు పాల్గొన్నారు. ఎలమర్రు గ్రామంలో సూరపనేని వెంకటసత్యనారాయణ, చెరుకూరి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ ఉన్నా నీళ్లు కరువే...

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని షేర్ మహమ్మద్ పేట మోడల్ కాలనీవాసులు మంచినీళ్లు లేక అల్లాడుతున్నారు. మోడల్ కాలనీలో వాటర్ ట్యాంక్ ఉన్నప్పటికీ వాటర్ ట్యాంక్ నీళ్లతో నిండకపోవడంతో ఆ ట్యాంకు అలంకారప్రాయంగా ఉండి గ్రామస్తులకు సక్రమంగా నీళ్లు లేక అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని మోడల్ కాలనీలో ట్రాక్టర్ ట్యాంకర్ ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ ఆ నీళ్లు మోడల్ కాలనీ వాసులందరికీ అందక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. దీంతో రామచంద్రుని పేట రోడ్ లోని బావి లో గల నీటిని మోడల్ కాలనీ ట్యాంకర్ కు పైపు కలిపి నీరు అందిస్తున్నప్పటికీ వాటర్ ట్యాంక్ నిండకపోవడంతో కాలని వాసులకు సక్రమంగా నీళ్లు అందకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ట్రాక్టర్ ట్యాంకర్ వస్తే మోడల్ కాలనీవాసులు బిందెలు, బకెట్లతో నీళ్లు మోసుకోవాల్సి వస్తుంది. అయినప్పటికీ ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా సక్రమంగా నీళ్లు అందకపోవడంతో ఇబ్బంది పడుకున్నారు. అసలే వేసవికాలం ఆపై గ్రామంలో భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తుంది. మోడల్ కాలనీలోని ఉత్తరం వైపు ఉన్న కాలనీ వాసులకు ఎగువన మీరు సరఫరా కాకపోవడంతో వారు వేసవికాలం, వర్షాకాలంలో సైతం నీళ్లకు తీవ్రంగా ఇబ్బం దులు పడుతున్నారు. మోడల్ కాలనీ సగభాగంలో పైపుకు వాల్ ఏర్పాటు చేసి నీళ్లు ఉదయం సగభాగానికి, సాయంత్రం సగభాగానికి నీళ్లు అందిస్తే సమస్య తీరుతుందంటున్నారు కాలనీ వాసులు.

వాటర్ ట్యాంకు వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

గ్రామ పంచాయతీ సర్పంచ్ లేకపోవడంతో అనేక సమస్యలు

షేర్ మమ్మద్ పేట గ్రామానికి సర్పంచ్ లేకపోవడం వల్ల ఈ గ్రామం ప్రత్యేక అధికారి కాలంలో ఉంది. గ్రామంలో ముఖ్యంగా మోడల్ కాలనీలో సక్రమంగా నీళ్ల సరఫరా కాకపోవటం, డ్రైనేజీ కాలువల సైతం సక్రమంగా తీయడం లేదని మోడల్ కాలనీ వాసులు వాపోతున్నారు. దీనికంతటికి కారణం గ్రామానికి సర్పంచి లేకపోవడం వల్లనే ఈ దుస్థితి వచ్చిందని వాపోతున్నారు. తమ సమస్య చెప్పుకోవాలంటే గ్రామ కార్యదర్శికి మాత్రమే చెప్పుకోవాల్సి వస్తుందని అలా కాకుండా సర్పంచ్ స్థానికంగా ఉంటే ఏ సమస్య అయినా సర్పంచ్ కి చెప్పుకునే అవకాశం ఉంటుందని అప్పుడు మాత్రమే సమస్య పరిష్కారం అయ్యేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మోడల్ కాలనీ వాసులకు నీటి సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని కాలనీవాసులు వాపోతున్నారు.

కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న ఫైబర్ నెట్ కేబుల్

ఫైబర్ నెట్ కేబుల్‌తో సమస్య

ప్రజాశక్తి - గంపలగూడెం : ప్రజలకు సౌకర్యంగా ఉండాల్సిన ఫైబర్ నెట్ కేబుల్ అసౌకర్యంగా మారిందని అనుములంక గ్రామస్తులు ఆరోపించారు. గ్రామంలో కందికొండ సత్యనారాయణ రెడ్డి, ప్రతాపరెడ్డి గృహాలను ఆనుకొని ప్రధాన రహదారిలో ఈ కేబుల్ కిందకు జారింది. దీనితో ప్రజలు, వాహనాలు, ప్రయాణికులకు తీవ్ర సమస్యగా మారింది. ఒక్కో సందర్భంలో ప్రమాదాలు జరుగుతున్నట్లు చెప్పారు. ఈ విషయమై స్థానిక పంచాయతీ కార్యదర్శి చెప్పగా, సదరు ఫైబర్ నెట్ మెయింటెనెన్స్ మేనేజర్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని తెలిపారు. ఈ సమస్యను ఎవరు తీర్చాలో తమకు కూడా సరిగా తెలియదని, తీర్చగలిగిన వారెవరు స్పందించి, సమస్యగా మారిన ఈ కేబులను తొలగించాలని కోరారు.

రసవత్తరంగా చదరంగం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎన్టీఆర్ జిల్లా చదరంగ సంఘం ఆధ్వర్యంలో 27, 28, తేదీల్లో రెండు రోజుల నుంచి స్థానిక విజయవాడలోని గేట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ సైన్సెస్ కళాశాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సీనియర్ ఓపెన్ చదరంగం పోటీలు నువ్వానేనా అనే విధంగా రసవత్తరంగా సాగాయి. ఈ చదరంగం పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో వందమంది అంతర్జాతీయ క్రీడాకారులు, 20 మంది టైటిల్ క్రీడాకారులు పాల్గొనడం విశేషం. ఈ పోటీలు ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇంటర్నేషనల్ మాస్టర్ ఎన్.కృష్ణ తేజ పాల్గొని క్రీడాకారులకు చదరంగంలో విలువైన ఎత్తులు... పై ఎత్తుల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ తాడిపత్రి కిషన్ బాబు , టోర్నమెంట్ చైర్మన్ బి రామ్మోహన్ రెడ్డి , అకాడమిక్ డీన్ బి జోష్న, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎమ్‌డి అక్బర్ పాషా, మందులు రాజీవ్ పాల్గొన్నారు.

విజేతలు

ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఎండి ఇమ్రాన్ 7/7 పాయింట్లతో ప్రథమ, ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన ఎం.జ్ఞాన సాయి సంతోషి 6/7 పాయింట్లతో ద్వితీయ, ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన మజ్జి రామ్ చరణ్ తేజ 6/7 పాయింట్లతో తృతీయ, ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన ఎం భార్గవ సుశాంత్ సాకేత్ 6/7 పాయింట్లతో నాలుగవ స్థానంలో నిలిచారు. ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు 50 వేల రూపాయలు నగదు ప్రోత్సాహకరంతో పాటు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందించారు. అంతేకాకుండా హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయ క్రీడాకారులకు మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారని, విద్యార్థుల కోసం వివిధ ఏజ్ గ్రూపులలో నగదు, ప్రశంసా పత్రాలు ముఖ్య అతిథులతో గెలుపొందిన క్రీడాకారులకు అందజేశారు.

చెస్ విజేతలు

అవరోధాలను అధిగమించాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : మార్కెటింగ్‌లో ఎదురయ్యే అవరోధాలను అధిగమిస్తే మంచి అవకాశాలను పొందొచ్చని ఫైన్ ల్యాబ్స్ సేల్స్ మేనేజర్ పి.నరేష్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల పీజీ మేనేజమెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మార్కెటింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'మార్కెటింగ్ అవకాశాలు అవరోధాలు' అంశంపై సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.నరేష్ మాట్లాడుతూ ఏ రంగంలోనైనా మార్కెటింగ్ ఆ సంస్థల విజయావకాశాలను ప్రభావితం చేస్తాయన్నారు. మార్కెటింగ్‌లో రాణిస్తే ఆ సంస్థ అద్భుతమైన విజయాలను దానితో పాటు ఆర్థిక శక్తిని పెంచుకోవటానికి అవకాశాలు ఉంటాయన్నారు. అయితే మార్కెటింగ్‌లో చాలా అవకాశాలతో పాటు అవరోధాలు సైతం ఎదురవుతాయన్నారు. విద్యార్థులు అవరోధాలను అధ్యయనం చేసినప్పుడు సమస్యల పరిష్కారాలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఏ రంగంలోనైనా అవగాహన, అధ్యయనం లేకుండా మార్కెటింగ్ అంశంలో రాణించటానికి అవకాశముండదన్నారు. కాబట్టి విద్యార్థులు ఆ దిశగా తమ దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు వారివారి రంగాల్లో చోటు చేసుకున్న అంశాలను తెలుసుకోవటానికి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివవరించారు. కార్యక్రమంలో పీజీ డైరెక్టర్ ఎస్ వెంకటేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పి.నరేష్

డ్యాన్స్, యోగాసనాల్లో శిక్షణ

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల, శాఖా గ్రంథాలయంలో మంగళవారం సమ్మర్ క్యాంప్‌లో డాన్స్ మాస్టర్ బిట్ర రాహుల్ కుమార్ విద్యార్థులకు డాన్స్ నేర్పించారు. డాన్స్‌లో విద్యార్థులు ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొన్నారు. డ్రాయింగ్ మాస్టర్ సర్వేశ్వరరావు విద్యార్థులకు డ్రాయింగ్ నేర్పించారు. ఆయుష్ డిపార్ట్‌మెంట్ నుండి యోగా మాస్టర్ మేడూరి మాణిక్యాలరావు, వక్రాసనం, అర్ధ మత్స్యేంద్రసనా, నేత్ర సంచలన, భూచరీ ముద్ర, కేసరి ముద్ర యోగాసనాలు విద్యార్థులకు నేర్పించారు. క్రాఫ్ట్ మాస్టర్ ఎం.కనకారావు విద్యార్థులకు క్రాఫ్ట్ వర్క్ నేర్పించారు. అనంతరం విద్యార్థుల చే పుస్తక పఠనం చేయించారు. ఆటలు ఆడించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-2 గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు పర్యవేక్షించారు.

తపస్యలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం చందాపురం గ్రామ శివారు తపస్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని పాఠశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ శాఖమూరి అమరకృష్ణ ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ శాకమూరి రజని తెలిపారు. వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ ఎల్‌కెజి నుండి 9వ తరగతి వరకు సిబిఎస్ఇ కరికులామ్‌తో నాణ్యమైన విద్య బోధిస్తున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులు, అంకిత భావంతో విద్యార్థులను ఉత్తేజితులను చేసి విద్యాబోధన అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు కష్టంగా భావించే ఇంగ్లీష్ భాషను సులభమైన రీతిలో బోధించటం, వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దటం తమ బాధ్యత అన్నారు. ఉన్నత భవిష్యత్తు కోసం స్కూల్ సమయం ముగిసిన తర్వాత, సెలవు రోజులలో ఉన్నత అర్హతలు కలిగిన మేనేజ్మెంట్, ఉపాధ్యాయులతో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఐఐటీ సిలబస్, కో-కరిక్యులర్ యాక్టివిటీస్ అను సంధానం చేసి ఉన్నత ప్రమాణాలతో విద్య, ఆటపాటలు నేర్పించడం మా బాధ్యత అన్నారు. వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించటం, అధునాతన పద్ధతిలో కంప్యూటర్ విద్య బోధన మా ప్రత్యేకత అన్నారు. ఉన్నతమైన సదుపాయాలతో తరగతి గదులు, రుచికరమైన బోజన సౌకర్యం, విశాలమైన ఆట స్థలం స్కూల్ ప్రత్యేకత అన్నారు. తల్లిదండ్రులు స్కూల్‌కు స్వయంగా విద్యార్థుల భవిష్యత్తు పై సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. నిరంతర సాధన, నిపూపమాన విజ్ఞాన సముపార్జన తమ ఆశయం అన్నారు.



రజని



అమరకృష్ణ ప్రసాద్

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.